# సీక్రెట్

రేపు రెండో శనివారం, శలవు కనక పది గంటలకల్లా క్లబ్‌లతో పేకాట మొదలెట్టాలన్న ప్రతిపాదన చేసిన వాణ్ణి నేనే. అంచేత నేను లేటయితే, మిగిలిన మెంబర్లు నా మొహం తగలేస్తారు. ఏదో ముఖ్యమైన పనుందని చెప్పి, త్వరగా రెండు మెతుకులు తినేసి, ఇంట్లోంచి బయటపడటమెలాగా అని ఆలోచిస్తుంటే అదృష్టం కలసిరావడమంటే, యిదే అనుకుంటాను, శుభ ఏ కళ నుందో, తొమ్మిదిన్నరకల్లా వంట చేసి గిన్నెలు, గరిటెలు డైనింగ్ టేబుల్ మీద అమరుస్తోంది. తను కూడా సాయం చేస్తే టైం కలిసొస్తుందని, శుభ్రంగా తుడిచి మూడు కంచాలు, మూడు గ్లాసులు టేబుల్ మీద పెట్టేను. ఫ్రిజ్ తీసి మంచి నీళ్ళ బాటిల్ అందుకోబోతున్నాను.

"ఇప్పుడవన్నీ ఎందుకు! వొచ్చేక అన్నం తిందాం" అన్న అపస్వరంతో శుభ గదిలోకెళ్ళింది.

"వొచ్చేకా! నువ్వూ, అనిల్ ఎక్కడికైనా వెడుతుఆన్నరా?" అని అడిగేను కీడు శంకిస్తూ.

"మ... నం... వె... డు... తు... న్నా... ము... ఇవాళ హనుమాన్ టెంపుల్‌కెళ్ళి అర్చన చేయిద్దామనుకున్నాం. మరచిపోయేవన్న మాట... ఊఁ త్వరగా తెములు అంది.

ఛస్! ఇప్పుడేమనుకుంటే ఏం లాభం! ఆ మాటే మరచిపోయేను. ఈ పూజల్లోను, వ్రతాల్లోనూ, కళ్యాణాల్లోనూ నాకు నమ్మకం లేదు. శుభకి మాత్రం మహా గట్టి నమ్మకం. ఆమెతో ఈ విషయంలో వాదించటం వ్యర్థ ప్రయత్నమని మా పెళ్ళి కాని ముందర్నించీ తెలసుండడం వల్ల, మాట తప్పకుండా ఆమెతో యాంత్రికంగా సహకరించడానికే అలవాటు పడ్డాను.

"అది కాదు, నేను మనస్సులో ప్రార్థించుకుంటాను. నువ్వూ అనిల్..." అని చూశాను.

"ఇక్కడ కూర్చుని మనస్సులో ప్రార్థించుకోవటం మనకి చేతకాదు కనుకనే ఈ గుళ్ళూ గోపురాలూ కట్టేరు. నో మోర్ ఆర్గ్యుమెంట్స్ ప్లీజ్. లేచి త్వరగా తయారవ్వు. ఓ గంట లేటయితే మీ క్లబ్ వూరు విడిచి పారిపోదు" అంది.

"స్కూటర్ తియ్యి నాన్న!" అంటూ పదకొండేళ్ళ మా సుపుత్రుడు అనిల్ ఆదేశించేడు. తల్లి లాగే వీడికీ బోలెడు భక్తి.

ఆలయం ముందున్న పార్కింగ్ ప్లేస్‌లో స్కూటర్ పెట్టుకుని వొచ్చేటప్పుడికి, ఆలయ ద్వారం ముందు కూర్చున్న బిచ్చగాళ్ళ వరుసలో చివర, ఏం జరిగిందో తెలీదు పదిమంది మూగేరు. ఈలోగా "అనిల్ ఏడీ?" అన్న శుభ కేక వినబడి అటూ యిటూ చూడ్డంలో ఆ గుంపులో వీడి నీలం నిక్కరు కనపడి అటు వెళ్ళేను. పద్మవ్యూహం లాంటి ఆ గుంపుని ఛేదించుకుని వాడు ముందు వరుసలోకి దూసుకువెళ్ళి నిలబడ్డాడు. ఇటు నుంచి నేనూ, అటు నుంచి శుభ ఆ గుంపుని చీల్చుకుని అందరితో బాటూ ఆ దృశ్యం చూస్తూ మేమూ ఓ నిముషం స్తంభించిపోయాం. ముప్ఫయ్యయిదేళ్ళుంటాయి. కాషాయ వస్త్రాలు ధరించి ఆ బిచ్చగాళ్ళ వరసలోనే ఓ సన్యాసి కూర్చున్నాడు. మంచి ముఖవర్చస్సుంది. తన ముందో తువ్వాలు పరుచుకున్నాడు. వెనకాలొక కేన్వాస్ బేగ్ వుంది. తువ్వాలు మీద ఓ తెల్లటి అరఠావు సైజు డ్రాయింగ్ పేపర్ల దొంతర, చేతిలో ఓ క్లిప్ అమర్చిన ప్లయ్‌వుడ్ బోర్డ్, పక్కనే బొగ్గు కణికలు వున్నాయి. ఆ బోర్డ్‌కి తగిలించిన పేపర్ల మీద ఆ బొగ్గు కణికలతో చకచక దేవతా చిత్రాలు నిముషాల్లో గీసేస్తున్నాడు. అప్పుడే పూర్తి చేసిన లక్ష్మీదేవి బొమ్మ ఒకావిడకిచ్చేడు. ఆమె మూడు రూపాయలు ఇచ్చింది. ఇంకొకతను గోపాల కృష్ణుడి బొమ్మ అడిగినట్టున్నాడు. పొన్న చెట్టు కింద నిలబడి, వేణువు వూదుతుండగా వెనకాల గోవు, దూరంగా గోపికలకేసి క్రీగంట చూస్తున్న కృష్ణుడు, త్రీ డైమెన్షనల్ ఎఫెక్ట్‌తో చూస్తుండగా అద్భుతంగా చిత్రించేడు. నా మనోనేత్రాలతో క్లబ్‌లో పేకాట దృశ్యం కనపడగానే, 'ఇంక బయటికి రా' అన్నట్టు గుంజుకుని శుభ వైపు జరిగేడు.

ఒకడి చేతిలో జీసస్ క్రీస్తు బొమ్మని చూశాను. శిలువ మీద వున్న క్రీస్తు ముఖ కవళికలు, స్పష్టంగా హృదయ విదారకంగా వున్నాయి. ఎంతిచ్చేరని అడిగేను " రెండు రూపాయలిచ్చేను. ఎంతిస్తే అంత పుచ్చుకుంటున్నాడనుకుంటాను. అందరూ రెండు మూడు యివ్వడం చూశాను అన్నాడు.

రోడ్ మీద రంగు రంగు సుద్ద ముక్కలతోనూ, బొగ్గుతోనూ అందమైన దేవతల బొమ్మలు, దేవాలయాలు, మసీదులు, చర్చిలు, రాజకీయ నాయకుల బొమ్మలు వెయ్యడం చూస్తూనే వుంటాం. ఇదొక కొత్త తరహా కళ. కోటి విద్యలూ కూటి కొరకే కదా! అయితే మొహం మీద చిరునవ్వు చెదరకుండా, మౌనంగా అడిగీ అడగ్గానే నాలుగు నిముషాల్లో ఎవరికి కావల్సిన చిత్రం వాళ్ళకి వేసిచ్చేస్తున్నాడు.

ఇంతలో మంచి స్థితిపరుడనుకుంటాను, ఓ మధ్య వయస్కుడు పట్టుపంచా, కండువా లాల్చీలు వేసుకున్నాడు. ఆలయంలోంచి సతీ సమేతంగా బయటకొచ్చి, "ఏదీ! వెంకటేశ్వరస్వామి బొమ్మ వేశావా?" అని అడిగేడు.

రెండు బొమ్మల కింద నించి తీసి ఆ సన్యాసి బొమ్మని అందించేడు.

"బాగే వేశావే! కంగ్రాట్స్" అంటూ లాల్చీ జేబులోంచి పర్సు తీస్తే, అతని సతీమణి పర్స్ లాక్కుని "నాల్రూపాయలు పడేస్తే, కలర్ ఫోటో వస్తుంది. ఇదేం చేసుకుంటాం! గోడకి తగిలించలేం, దాచలేం, పారెయ్యలేం- ఇదిగో నాయనా దీన్ని మరెవరికైనా అమ్ముకో' అంటూ ఆ బొమ్మా దాంతో పాటు రెండు రూపాయల కాసు తువ్వాలు మీద పడేసి భర్త జబ్బట్టుకుని లాక్కుపోయింది.

అది చూసిన ఓ ముసలమ్మ " ఆ బొమ్మ రూపాయికిస్తావా?" అని అడిగింది. చేతిలో వున్న రూపాయి కాసు వేళ్ళ మధ్య నలుపుతూ..

అంతవరకూ చిరునవ్వు తప్ప నోరు మెదపని ఆ సన్యాసి ఆ చిత్రాన్ని రూళ్ళ కర్రలాగా చుట్టి రబ్బర్‌బ్యాండ్ వేసి నా చేతికిచ్చి, "రూపాయి ఖర్చు పెట్టి ఈ బొమ్మ కొన్నందుకు ఆమె కోడలు ఈమెపై చిందులు తొక్కుతుంది. నా తల్లి లాంటికీమెకి భక్తితో కానుకగా సమర్పిస్తున్నానని నచ్చచెప్పి ఆమె కివ్వండి. లేకపోతే చిన్న బుచ్చుకుంటుంది. పైగా చిత్రం ఆమెకి మనశ్శాంతి నిస్తుంది" అని ధారాళమైన ఇంగ్లీషులో అర్థించేడు.

ఒక క్షణం నిర్ఘాంతపోయి, తేరుకుని, మంచి మాటల్తో ఒప్పించి ఆ చిత్రాన్ని ఆమె చేతిలో పెట్టేను.

ఆమె అతనికి నమస్కరించి, పరవశంతో దాన్ని కళ్ళకద్దుకుని వెనుతిరిగింది.

అతనామెకేసి చూడకుండా తన పనిలో తాను నిమగ్నుడై వున్నాడు.

"నిజంగా నీ కోడలు కోప్పడుతుందా?" అని ఆమెని ఆపి శుభ అడగ్గానే, "అవునమ్మా! మా పెద్ద కోపిష్టిది. రూపాయెట్టి పాలకూర తెమ్మని చిల్లర లేక రెండు రూపాయల కాసిచ్చింది" అంది ఆ ముసలమ్మ ఎడం చేతిలో వున్న పాల కూర కట్ట కనపడుతుండగా.

వీడికేదో 'క్లెయర్ వాయిస్స్' వుందనుకుంటాను-అసాధ్యుడే.

ఇంతలో ఇద్దరు కుర్రాళ్ళు సినీమా స్టార్స్ పేర్లు, క్రికెటర్ల పేర్లు, రాజకీయ నాయకుల పేర్లు దండకంలాగ చదివి వాళ్ళ బొమ్మలు వెయ్యగలవా అని అతన్ని అడుగుతుంటే మౌనంగా నవ్వుకున్నాడు తప్ప వాళ్ళకేసయినా సరిగ్గా చూడలేదు.

ఉన్నట్టుండి మా అనిల్ హనుమాన్ బొమ్మ వెయ్యమన్నాడు. అతను అలాగే అన్నట్టు కాగితం తీసి చిత్రరచనకుపక్రమిస్తుండగా "మేము దాన్ని అర్చన చేసుకొచ్చిన తర్వాత తీసుకుంటాం" అంది శుభ.

సరే అన్నట్లు తలూపేడు.

మేము ఆలయంలో ప్రదక్షిణం చేసి భక్తుల గుంపులో ముందుకు తోసుకు వెదుతుంటే మా అనిల్, "వన్ మినిట్, ఆ బొమ్మలేసే స్వాములారితో హనుమంతుడు సంజీవ పర్వతాన్ని తెస్తున్నట్టుగా వెయ్యమని చెప్పొస్తాను" అంటూ వెనక్కి వెళ్ళబోతుంటే జబ్బట్టుకు లాగి, "ఏదో ఓ బొమ్మ. అతనికి తోచినట్టు వేస్తాడు" అన్నాను.

వెళ్ళనిస్తే అదయ్యేవరకూ అక్కడే కూర్చుంటాడన్న భయంతో శుభ కూడా వాడి చెయ్యి పట్టుకుంది. మళ్ళీ వెనక్కి పరిగెత్తకుండా.

పూజారి తెచ్చిన పళ్ళెంతో శుభ పూజా ద్రవ్యాలతో తెచ్చిన పూల సజ్జా, అర్చన టిక్కెట్టు పెట్టింది. ఆయన మా గోత్ర నామాలు అడిగేడు.

నేను నోరు మెదపకముందే మా అనిల్ ఠంగున చెప్పేడు.

శుభ చిరునవ్వుతో వాడి తల నిమురుతూ 'చూశావా నీ కంటే వాడే నయం' అన్నట్టు చూసింది.

"మన గోత్ర నామాలు చెప్పకపోతే మన మెవరమో ఆంజనేయస్వామికి తెలియదా! ఈ అర్చన తాలూకు పుణ్యం ఇంకెవళ్ళ ఎకౌంట్‌లోనో జమ అవుతుందన్న భయమా!' అని గొణిగేను.

"అది పూజారికొక విద్యుక్త ధర్మం, ఆధ్యాత్మిక సాధన; మనకి సంతోషం సంతృప్తి" అంది శుభ నాకేసి చురచుర చూస్తూ.

తీర్ధ ప్రసాదాలు తీసుకుని ఆచారం పాటిస్తూ ఆలయ మంటపంలో కాస్సేపు కూర్చుని బయటకొచ్చేటప్పటికి పదకొండు దాటింది. బయటకొచ్చి చూస్తే ఆ సన్యాసి చుట్టూ యింకా జనం మూగే వున్నారు.

అనిల్ గుంపువైపు పరుగుతీసేడు. వాడి వెనుకాలే గుంపుని చీల్చుకుని మేమూ ముందుకు వెళ్ళాం.

చిత్ర రచన నిరాఘుంటంగా సాగుతూనే వుంది.

మా వాణ్ణి చూడగానే, దత్తాత్రేయుడు, అయ్యప్ప బొమ్మల కింద నుంచి హనుమంతుడి బొమ్మ తీసి మావాడికిస్తూ, "ఇదిగో నీకు నచ్చినట్టే వేశాను, చూసుకో" అన్నాడు.

అది చూసి సంతోషంతో థేంక్స్ చెప్పేడు. హనుమంతుడు సంజీవ పర్వతాన్ని మోసుకొస్తున్న చిత్రమే అది.

వెంటనే శుభ అతని చేతిలో పది రూపాయలు నోటు పెట్టి, "ఈ చిన్న పారితోషికం తీసుకోండి కాదనకండి" అంటూ అర్థించి నమస్కరించింది.

అనిల్ కూడా నమస్కరించడం చూసి ఆ సన్యాసి తన వెనక నున్న సంచిలోంచి ఓ చాక్లెట్ తీసి వాడి చేతిలో పెట్టి, వాడి పేరడిగి, ముందుకు తల వంచమని వాడి చెవిలో ఏదో ఉపదేశం చేసినట్లున్నాడు. చాలా శ్రద్ధగా విని మళ్ళీ, "థ్యేంక్యూ సర్ నమస్తే" అన్నాడు అనిల్.

ఆ బొమ్మ అనిల్‌కే కాదు మాకూ కూడా నచ్చింది. కాస్తంత నేను కూడా కళాపోషణ చేద్దామన్న సత్సంకల్పంతో అతన్ని సాయంత్రం మా క్లబ్‌కి రమ్మని ఆహ్వానించేను. పది మంది ముందూ అతని కళ ప్రదర్శించడానికీ, మా మెంబర్ల చేత సత్కారం జరిపించడానికి అవకాశముంటుందని.

అతను చిరునవ్వుతో తల అడ్డంగా ఊపాడు.

స్కూటర్ మీద వెడుతూ, "అతని కళని ప్రోత్సహించి ఆర్థికంగా సహాయం చేద్దామనుకుంటే...' అన్నానో లేదో, "చదువు, సంస్కారం, ఆత్మాభిమానం, లోకజ్ఞానం వున్న వాడు కనుకనే రాను పొమ్మన్నాడు. క్లబ్‌లోనూ, సినిమా హాలు దగ్గిర, హోటల్ ముందూ కూర్చుని దేవుళ్ళ బొమ్మలు వేస్తే కొనేవాడుండడు. ఇలాంటి బొమ్మలు, ఆధ్యాత్మిక గ్రంథాలు కొనాలన్న అభిలాషకి అనువైన మానసిక వాతావరణం దేవాలయాల దగ్గిరే ఉంటుంది." అని శుభ వాఖ్యానించింది.

"నాన్నా! సాయంత్రం తొందరగా యింటికొచ్చెయ్యి" అన్నాడు అనిల్, నేను క్లబ్‌కి బయల్దేరి వెడుతుంటే,

"ఎందుకు?" అడిగేను.

"దీన్ని ఫ్రేం చేయిద్దాం" అన్నాడు ఆ కాగితాన్ని చూస్తూ తన్మయంతో.

"బొగ్గుతో గీసింది ఎంత సేపుంటుందీ! కాసేపటికి బొగ్గు కాస్తా రాలిపోతుంది" అన్నాను.

"ఫ్రేం చేయిస్తే అద్దానికంటుకుని రాలిపోకుండా ఉంటుంది" అంటూ నాకు ఫిజిక్స్ బోధించేడు. అంతా తల్లి పోలికే!

"అలాగే లే." అన్నాను ఎలాగా రానని తెలుసుండి.

★ ★ ★

"పాపం! అనిల్ నువ్వు బజారుకి తీసుకెళ్ళి ఆ కాగితం ఫ్రేం చేయిస్తావని రాత్రి తొమ్మిది వరకూ ఎదురు చూసేడు" అంది నేనింటికొచ్చేక.

"దేమిటి! నువ్వు కూడా, అర్థం లేకుండా, వాడి వేలం వెర్రికి తాళం వేస్తావేమిటి!" అన్నాను.

"గొప్ప కళాకారుడని క్లబ్‌కి ఆహ్వానించేవు కదా! ఆ కళాఖండాన్ని కనీసం మనింట్లోనైనా ప్రదర్శిస్తావనుకున్నాను, పైగా అలాగే వుంటే బొగ్గు కాస్తా రాలిపోతుందన్నావు కదా!"

"ఆల్‌రైట్... దాన్ని జాగర్త పెట్టి ఫ్రేం చేయిస్తానులే" అన్నాను. ఇంక వాదించి లాభం లేదని.

ఆ కాగితం చేతిలో పెట్టుకుని అనిల్ నిద్రపోతున్నాడు. వాడికి మెలుకవ రాకుండా నెమ్మదిగా వాడి వేళ్ళు తప్పించి, ఆ నలిగిన కాగితాన్ని తీసి నా టేబుల్ మీదున్న అద్దం కింద చదునుగా పరిచి పెట్టేను.

★ ★ ★

నిత్యం ఉదయం నాలుగున్నరకి టెలీఫోన్ రింగవుతుంది. అది మా కాలనీలో వున్న పదిమంది లేడీ మార్నింగ్ వాకర్స్‌కి వేకింగ్ కాల్. ఆదివారం ఉదయం ఫోన్ రింగవగానే శుభ ఠంగున లేచి రిసీవర్ అందుకుని, నిత్యం జవాబిచ్చే సాంకేతిక భాషలో, "గుడ్ మార్నింగ్, కమింగ్, థ్యాంక్యూ" అని రిసీవర్ పెట్టేసి కెవ్వుమని కేకేసింది.

నేను హడలిపోయి డ్రాయింగ్ రూంకి వెళ్ళేసరికి శుభ, "లైట్ స్విచ్ వెయ్యకు. నీ టేబుల్ మీద చూడు" అంది.

అద్దం కింద వున్న హనుమంతుడి బొమ్మ చుట్టూ తెల్లని కాంతి ప్రసరిస్తోంది.

నేను నిర్ఘాంతపోయాను.

అదే సమయానికి డోర్ బెల్ మోగగానే గుండె ఝుల్లుమంది తలుపు తీస్తే ఆంజనేయుడు కాని ప్రత్యక్షమౌతాడేమోనని. గడియ మీద చెయ్యి పెట్టి, "ఎవరు?" అన్నాను. "ప్రకాశాన్ని" అన్న గంభీర స్వరం వినగానే షాక్ కొట్టినట్టయింది.

"మన పక్క ఫ్లాట్‌లో కొత్తగా దిగిన ప్రకాశం గారు" అంది శుభ.

అప్పుడు తేరుకుని లైటేసి తలుపు తీశాను. శుభకేసి కేక విని కంగారుపడి లేచొచ్చేడట. నిన్న ఉదయం ఎపిసోడ్ తాలూకు టేప్ రివైండ్ చేసినట్టు ఆడియో విజువల్ డిటెయిల్స్ అన్నీ ఏకరువు పెట్టి, ఆయన సమక్షంలో తులుపేసి లైటార్పేసి ఆ వింత దృశ్యం ప్రదిర్శించింది.

"గుడ్ హెవెన్స్" అంటూ కొంత సేపు మౌనంగా పరిశీలించి, "ఆ సన్యాసెవరో సామాన్యుడు కాదు" అని శలవిచ్చేడు.

ఈయన డిఫెన్స్ రీసెర్చి లేబరేటరీస్‌లో రిటైరైన డిప్యూటీ డైరెక్టర్.

"అవును అంకుల్. ఆ విషయం, ఆ చిరునవ్వు, ఆ నిరహంకారం, ఆ సంతృప్తి, ఆ అతీంద్రియశక్తులు" దండకం ప్రారంభించింది శుభ.

"ఇదేమైనా ...." అని నోటితో ఆలోచిస్తుంటే, "నాన్‌సెన్స్, కాగితం కాలిపోతోంది" అంది అఫ్‌కోర్స్ అదీ నిజమే.

"ఇతనెవరో తీవ్రమైన ఆధ్యాత్మిక సాధన చేస్తున్న మహనీయుడై వుంటాడు. ఈ కళారాధన అందులో భాగమే అయి వుంటుంది. ఎందరో సిద్ధ పురుషులు, యోగులు, భగవత్తత్వాన్ని ప్రచారం చెయ్యడానికిలాంటి వింత అనుభవాలు కలిగించిన దృష్టాంతాలున్నాయి" అన్నాడాయన.

"సర్, మీరు ఇలాంటి మిరకిల్స్ నమ్ముతారా!" అన్నాను.

"పరిమితమైన మన భౌతిక విజ్ఞాన శాస్త్రానికి ఏ శక్తి అసాధారం అనిపిస్తుందో దాన్ని మిరకిల్ అంటాం. సాధనాశక్తి, శోధనాసక్తి వున్న ఆధ్యాత్మిక తత్వజ్ఞానులకి అటువంటి శక్తి అసాధారణం కాదనడానికి చరిత్రాత్మక ఆధారాలున్నాయి. అందుకే "Science without spirituality is lame and spirituality withtout science is blind అన్నాడు అయినీస్టీన్" అంటూ బయటకెళ్ళి ఆ టాపిక్‌కి తలుపు మూసేడు.

★ ★ ★

శుభ మార్నింగ్ వాక్‌కి వెళ్ళలేదు. అలా చీకట్లో ఆ బొమ్మకేసి చూస్తూ కుర్చీలో కూర్చుంది. ఆ కాంతి తగ్గుతూ పావుగంటలో మాయమైంది. అది అలాగే వుంటే ఆ మార్నింగ్ వాకింగ్ మహిళా భక్తులందర్నీ పిలుచుకొస్తుందేమో, మా యిల్లో భజన మందిరం అవుతుంది అని భయపడ్డాను.

పొద్దునే లేచాక అనిల్‌ని శుభ అడిగింది. ఆ సన్యాసి వాడి చెవిలో చెప్పిందేమిటీ అని.

"సీక్రెట్. ఇప్పుడు చెప్పకూడదు" అన్నాడు.

"మరెప్పుడు చెప్పాలి?" అడిగేను.

"ఆయన ఎప్పుడు చెప్పమన్నాడో అప్పుడు" అన్నాడు.

ఇలాంటి పెంకి సమాధానాలు చెప్పడం వాడికి కొత్త కాదు. మొదట్నుంచీ వాడు తల్లి పెంపకంలో పెరిగేడు. దానికి సాయం వాడి స్కూల్లో 'మాతృదేవోభవ' అని తప్ప 'పితృదేవోభవ' అని నేర్పించరేమో! ఇలాంటి కొంటె సమాధానాలు చెప్పినందుకు గతంలో రెండుసార్లు దవడ మీద వాయించేను.

ఎప్పుడూ నేనే సిగరెట్టు పెట్టి కొనియింటికి తెచ్చుకుంటాను. నాలుగు నెలల క్రితం మా యింటికో చిరకాల స్నేహితుడొచ్చేడు. కాఫీ, ఫలహారాలతో శుభ, నేనూ అతిథి మర్యాదలు చేశాం. సో ఫార్ సో గుడ్, సిగరెట్ పెట్టి చూస్తే లేదు. ఆఫీసులోనే మర్చిపోయి వుంటాను. అనిల్‌ని పిలిచి డబ్బులిచ్చి ఓ సిగరెట్ పెట్టి తెమ్మన్నాను. ఫర్ ది ఫస్ట్ టైం వాడలాగే నిలబడ్డాడు కాని కదల్లేదు.

"ఏమిటలా చూస్తావు! వెళ్ళిరా" అన్నాను.

"నేనొకటి కాల్చుకుని మిగిలినవి తెస్తాను" అన్నాడు. ఏడో క్లాస్ చదువుకునే కుర్రవెధవ అంత రూడ్‌గా అంత ఏరోగెంట్‌గా మాట్లాడటం సహించలేక పోయేను.

"పిచ్చి పిచ్చి వాగుడు కట్టిపెట్టి వెళ్ళి కొనుక్కురా" అన్నాను కళ్ళెర్రజేస్తూ.

"ఇప్పట్నుంచీ నేర్చుకోపోతే పెద్ద వాణ్ణయ్యేక రోజూ రెండు పేకట్లైనా కాలుస్తానూ! అన్నాడు. కొత్తగా నేర్చిన పాఠం అప్పగిస్తున్నట్లు.

ఫట్ మని చెంప మీద ఒకటేసి, "గో ఎండ్ గెటిట్" అన్నాను.

అంతే ఆ డబ్బక్కడ సోఫాలో పడేసి ఇంట్లోకి పరిగెత్తేడు.

వాణ్ణి పట్టుకుని బయటకీడుద్దామని లేస్తుంటే మా ఫ్రెండ్ నా భుజం పట్టుకుని ఆపేడు.

గది గుమ్మానికి అడ్డంగా నిలబడింది శుభ.

రాత్రి బయటే భోంచేసి వొచ్చేను. డైనింగ్ టేబుల్ మీద నా కంచం ఒక్కటే ఉంది. అంటే వాళ్ళిద్దరూ నిరాహార దీక్షన్నమాట. వాణ్ణి పక్కలో పడుకోపెట్టుకుని పడుకుంది శుభ. వాడి దవడ బాగా పొంగింది. పళ్ళు కూడా ఊడితే బాగుండును. వెధవ సమాధానం వాడూనూ! నా ఫ్రెండ్ ఎదుట ఎంత అవమానం!

నేను పలకరించలేదు. పొద్దునే కాఫీ కూడా తాగకుండా బయటికి పోయేను. శుభ ఆఫీసుకెళ్ళలేదని, వాడు పచ్చి మంచి నీళ్ళు కూడా ముట్టలేదని పనిమనిషి చెప్పింది.

సాయంత్రం నేనే కొంచెం మెత్తబడి, "ఇంక నేనేమీ అనను, లేచిరా అన్నం తిను" అన్నాను.

రాత్రి నాకు కంపెనీ కోసమన్నట్లు శుభ ఒక్కర్తే, రెండు మెతుకులు ముట్టుకుంది. వాడి పంతం సడలలేదు. నోరు మెదపలేదు.

మూడో రోజు కూడా వాడు మొండి పట్టు మానలేదని శుభ కంటతడి పెట్టింది. దాంతో ఆ మౌన యుద్ధంలో బేషరతుగా తెల్లజెండా ఎత్తేసి వాడి పక్కన పడుకుని బుజ్జగించడానికి ప్రయత్నించేను. వాడు కన్నెత్తి చూడలేదు. కదల లేదు, నోరు మెదపలేదు.

నాలుగో రోజున మేము భయపడినట్టుగానే డాక్టర్ సలహా మీద నర్సింగ్ హోంలో చేర్చి సెలైన్ డ్రిప్ ఏర్పాటు చేశాము. శుభని ఓదార్చడం నా తరం కాలేదు. వాణ్ణి చూడ్డానికి నా కొలీగ్స్‌తో బాటు వాడి స్కూల్ హెడ్ మాస్టర్ కూడా వొచ్చేడు. రెండు బాటిల్స్ అయిన తరువాత నెమ్మదిగా కళ్ళు తెరిచేడు. నాకు దుఃఖం ఆగలేదు.

“బాబూ అనిల్! నాదే తప్పు. ఇంకెప్పుడూ కొట్టను” అన్నాను వాడి కుడి చెయ్యి నాచేత్తో పట్టుకుని.

నీరసించిన స్వరంతో, “నాన్నా! సిగరెట్ మానేస్తారా?” అన్నాడు.

“అలాగే” అన్నాను, ఏమైనా చెయ్యడానికి సిద్ధంగా వున్న ఆ పరిస్థితిలో.

నెమ్మదిగా నా చెయ్యి పట్టుకుని తలగడ మీదకి లాగి వాడి తల మీద వుంచి, “ప్రామిస్” అన్నాడు.

“అయ్ ప్రామిస్” అన్నాను.

ఆ క్షణంలో వాడి పెదవుల మీద విరిసిన చిరునవ్వుతో అక్కడ వున్నవాళ్ళందరి కళ్లూ తుడిచేడు.

రెండేళ్ళ క్రితం ఓసారి నేనూ శుభా, మా ఫైనాన్షియల్ ఇన్వెస్ట్‌మెంట్ గురించి సీరియస్‌గా డిస్కస్ చేస్తున్నాం. ఇంతలో ఫోన్ రింగయింది. అనిల్ రిసీవర్ తీసి విని నాతో, “సుబ్బారావుగారు” అన్నాడు. రిసీవర్ నాకందివ్వబోతూ.

వాడో డబ్బారావు. నాకూ వాడికీ మధ్య మాట్లాడుకోదగిన విషయాలేమీ ఉండవు. ఏమీ తోచనప్పుడు ఫోన్లో పిచ్చాపాటి మొదలెడతాడు. అనిల్‌తో స్వరం తగ్గించి వెంటనే “ఇంట్లోలేనని చెప్పేయ్” అన్నాను.

“నేనబద్ధం చెప్పను. బిజీగా వున్నారు తర్వాత ఫోన్ చెయ్యండి అని చెప్తాను” అన్నాడు.

సుబ్బారావు కదంతా వినబడింది. గత్యంతరం లేక రిసీవర్ అందుకుని వాడికి సంజాయిషీ, క్షమాపణ చెప్పుకున్నాక ఫోన్ పెట్టేసి ఈ అయిదో క్లాస్ చదివే హరిశ్చంద్రుడి చెంప ఛెళ్ళుమనిపించేను. నాటి నుంచి నేటి వరకు టెలిఫోన్ రింగయితే, పక్కనే వున్నా, మేము రిసీవర్ తియ్యవలసిందే కాని వాడు తియ్యడు రణ పెంకి!

జుగుప్స కలిగించే తలాతోకా లేని ఈ తెలుగు సీరియల్స్ ధర్మమా అని టీవి చూసే ఉత్సాహం, అభిరుచి, అలవాటు క్షీణించేయి. తీరుబడి వున్నప్పుడు, ఎంటర్ టైన్‌మెంట్ గయిడ్ చూసి కాలక్షేపానికి సెలెక్టెడ్ ఛానెల్స్ చూడడానికి నేనూ శుభ అలవాటు పడ్డాం.

మరి వాడికి స్కూల్లో ఏం నూరిపోస్తారో తెలీదు. సినిమా మాట సరేసరి టివి కూడా నిషిద్ధం.

మంచి ప్రోగ్రామని ఆహ్వానిస్తే తప్ప టివి వైపు చూడడు. వాడి ఆటలు, వాడి మాటలు, వాడి చదువు, స్నేహితులు – వీడి టైం మేనేజ్‌మెంట్‌లో ఏదో ప్రత్యేకత వుంది. సెలవు దినాల్లో లంచ్, రాత్రిళ్ళు డిన్నర్ సాధారణంగా ముగ్గురం కలిపే తింటాం. తినే ముందు వాడు రెండు నిముషాలు నిశ్శబ్దంగా ప్రార్థన చేస్తాడు. అది పూర్తయ్యేవరకూ మేము కంచాల్లో చెయ్యి పెట్టకూడదు. తల్లీ కొడుకూ ఒకటై పాటించే ఈ అలవాటుని కాదని నేను సాధించేదేముందని సమాధానపడతాను. ఇవన్నీ ఎందుకు చెబుతున్నానంటే అనిల్ తన యీడు పిల్లలకి సహజమైన ధోరణిలో పెరుగుతున్నాడా, తల్లీ కొడుకుల మధ్య నలిగి నా వ్యక్తిగతాన్ని కోల్పోతున్నానా అన్న సందేహం కలుగుతూ వుంటుంది.

ఉదయం కాఫీ తాగాక, “ఓసారి హనుమాన్ టెంపుల్‌కెళ్ళి ఆ బొమ్మ తాలూకు కాంతి ప్రసారం గురించి ఆ సన్యాసినే అడుగుదాం. నీకు మిరకిల్స్‌లో నమ్మకం లేకపోయినా, సైంటిఫిక్ క్యూరియాసిటీ”.. అంటూ శుభ ప్రాధేయపూర్వకంగా ప్రతిపాదించింది.

“అక్కడికెళ్ళి అతనితో మాట్లాడడానికే అయితే వొస్తాను. మరి. నీ భక్తి పారవశ్యంలో ఆయన్ని మనింటి భిక్షకో పిలిచి...” నా అనుమానం నాది.

“ఒక వేళ అలాగే పిలిస్తే దానిక్కావలసిన ఏర్పాట్లన్నీ నేను చూసుకుంటాను. నీ ఆదివారం కార్యక్రమాలకి అవరోధం కలగకుండా నీయిష్టమొచ్చినట్లు తిరిగి తిని క్లబ్‌కి పోయి”... అభయమిచ్చింది.

మేమిద్దరం టెంపుల్ కెళ్లేం. అక్కడున్న పాతిక ముప్ఫయిమంది బిచ్చగాళ్ళకి తలో రెండేసి అరటిపళ్ళు కొనిచ్చి తను తిని వెళ్ళిపోయేడుట. అతను నిన్న ఉదయమే వొచ్చాడట. సాయంత్రం వూరు విడిచి వెళ్ళిపోయాడట. ఇంక ఎక్కడ వెతకం!

నెల్లాళ్ళ తరువాత శుభ వాళ్ళాఫీసు నుంచి నాకు ఫోన్ వచ్చింది. సెవెన్త్ క్లాస్ స్టేట్ ఎగ్జామ్స్‌లో అనిల్‌కి ఫిఫ్త్ ర్యాంక్ వచ్చిందని వాడి స్కూల్ హెడ్‌మాస్టర్ ఫోన్ చేశాడట. వాడి ఫ్రెండ్స్‌ని పిలిచి పార్టీ చేసుకోవడానికి తను అయిస్క్రీం తెస్తుందిట. నన్ను స్నాక్స్ తెమ్మంది.

మేమిద్దరం సాయంత్రం వాడికి కంగ్రాట్స్ చెప్తే–

“నాకు ఫిఫ్త్ ర్యాంక్ వస్తుందని ముందే తెలుసు” అన్నాడు.

"ఎలా తెలుసు?" అడిగేను.

"హనుమాన్ టెంపుల్‌కి దగ్గర కూర్చుని బొమ్మవేశారూ, ఆ స్వాముల వారు చెప్పేరు. ఇప్పుడిప్పుడే ఎవరికీ చెప్పకు నవ్వు బాగా చదువు, నీకు ఫిఫ్త్ ర్యాంకొస్తుంది అని" ఇలా చెప్పేసి వాడి ఫ్రెండ్స్ వొస్తే వాళ్ళని తీసుకుని తన గదిలోకి పరిగెత్తేడు.

"నువ్వు పది రూపాయలిచ్చేవు కనుక ఫిఫ్త్ ర్యాంకొచ్చింది. నువ్వు వంద రూపాయలిస్తే ఫస్ట్ ర్యాంక్ వచ్చునేమో!" అన్నాను కాస్త వ్యంగ్య ధోరణిలో.

"డోంట్ టాక్ రాట్! ఆయన భవిష్యద్దర్శన శక్తి కది నిదర్శనం. వీడి ర్యాంక్ సాధించడం వీడి స్వయంకృషి ఫలితం" అంది శుభ.

"అంత రహస్యంగా చెప్పడమెందుకు?"

"వాడి ఉత్సాహాన్ని, పట్టుదలని పెంచడానికి. మనల్ని సర్‌ప్రైజ్ చేసే ఆనందం వాడికి దక్కడానికి" అంది శుభ.

వాడి ఫ్రెండ్సందరూ వెళ్ళిపోయాక అనిల్, "మనం అర్జెంట్‌గా హనుమాన్ టెంపుల్ కెళ్ళాలి" అన్నాడు.

"ఇప్పుడా!" అంది శుభ.

"ఆ చాక్లెటిచ్చిన స్వాములవారికి నమస్కరించి ఏదైనా ప్రజెంట్..." అంటుంటే ఆయన అప్పుడే ఊరు విడిచి వెళ్ళిపోయారని వాడి తల్లి చెప్పగానే నమ్మలేనట్టు ఆశ్చర్యపోయేడు.

"మరదేమిటి అలా చెప్పేరు. మళ్ళీ వస్తారేమో!" అన్నాడు తన ఆలోచనకి సమాధానం వాడే ఊహించుకుంటూ.

"ఏం చెప్పాడాయన" అడిగేను, నోరుజారి.

"సీక్రెట్" అన్నాడు.

శుభ కూడా నవ్వింది. నిస్సహాయంగా.

తర్వాత రెండు మూడేళ్ళలోనూ ఎప్పుడూ హనుమాన్ టెంపుల్‌కెళ్ళినా ఆ సన్యాసి కనపడతాడేమోనని చూసేవాడు.

* * *

నెల్నాళ్ళ క్రితం వెళ్ళిన దంపతులు ప్రకాశంగారు, కామేశ్వరిగారు దక్షిణాది యాత్రలు ముగించుకుని చెన్నై నుంచి ఈ రోజే దిగారు. ఆదివారం కాబట్టి పగలిక్కడే భోజన ఫలహారాలు చెయ్యాలని బలవంతం చేస్తే మా ఫ్లాట్‌కొచ్చారు. వాళ్ళు దర్శించిన పుణ్యక్షేత్రాల తాలూకు కుంకుమ ప్రసాదాలు కామేశ్వరిగారు శుభకిచ్చింది.

ప్రకాశంగారు మా అనిల్‌తో "నీకు స్పెషల్ ప్రసాదం పట్టుకొచ్చేను" అని వాడి చేతిలో ఓ చాక్లెట్ పెడుతూ, "ఇది మూడేళ్ళ క్రితం ఆంజనేయస్వామి బొమ్మేసిన సన్యాసి ఇచ్చాడు" అన్నారు.

"థ్యాంక్స్ తాతగారూ! ఆయన మాటంటే మాటే. తప్పకుండా యిస్తానన్నారు. మీతో పంపించేరన్నమాట!" అన్నాడు జేబులో పెట్టుకుంటూ.

"అంకుల్ ఆ సన్యాసిని చూశారా ఎక్కడ? అడిగింది శుభ.

"గురువాయూర్ ఆలయం బయట, బొమ్మలేస్తూ కనపడ్డాడు. నీ వర్ణన జ్ఞాపకమొచ్చి నిర్ధారణ చేసుకోవడానికి 'మూడేళ్ళ క్రితం మీరు హైదరాబాద్ వచ్చేరు కదా!' అని అడిగేను. 'అవును' అన్నాడు. 'మీరు వేసిన ఆంజనేయులు బొమ్మ చూశాను. ఆ కుటుంబం మా కుటుంబం పక్క పక్క ఫ్లాట్స్‌లో వుంటున్నాం' అన్నాను.

'తెలుసు. అనిల్ ఆ పిల్లవాడి పేరు. టెన్త్ పరీక్షల ముందర యిస్తానన్నాను' అంటూ చాక్లెట్ తన సంచిలోంచి తీసి నా చేతికిచ్చి 'దయుంచి అతనికివ్వండి ' అన్నాడు.

'టెన్త్ పరీక్షలు వారం కిందే అయిపోయి వుంటాయి. అయినా మీ ఆశీస్సుల్తో తప్పకుండా యిస్తాను' అని తెచ్చేను.

'అంకుల్! వీడి పరీక్షలింకా అవ్వలేదు. క్వశ్చన్ పేపర్లు లీకయ్యాయని పోస్ట్‌పోన్ చేశారు' అంది శుభ.

'ఆఁ! అంటూ నిర్ఘాంతపోయాడాయన.

** రచన, 2004*